

# అభిజ్ఞ

## – భార్గవ చందు



## 4

తీసుకున్న కొత్త సిమ్ కార్డ్ ని కొత్త ఫోన్ లో వేసి మనుకి కాల్ చేశాడు త్రిలోక్.

“చెప్పు త్రిలోక్?” అంది మను ఫోన్ లిఫ్ట్ చేయగానే,

“నేను కాల్ చేస్తాను అని ఊహించావా?” అడిగాడు త్రిలోక్.

“ఇంకెవరికీ ఈ నెంబర్ తెలియదు, చెప్పు ఏంటి విషయం” అంటూ మను మాటలు వినిపించాయి.

“మధుకర్ దగ్గర నీకు సంబంధించిన ఎటువంటి ఇన్ఫర్మేషన్ లేదు” మను అడగకుండానే చెప్పాడు త్రిలోక్.

మను ఒక నవ్వు నవ్వి... “ఉండేది కానీ ఇప్పుడు లేదు... ఎందుకంటే మధుకర్ చనిపోయాడు కాబట్టి”

“అంటే!!?” అన్నాడు త్రిలోక్.

“అంటే నాకు కావల్సిన ఇన్ఫర్మేషన్ మధుకర్ మైండ్లో ఉందని అర్థం, అతని దగ్గర ఉన్న వస్తువుల్లో కానీ, కాగితాల్లో గాని దాచిన ఇన్ఫర్మేషన్ కాదు అది...”

“మధుకర్ కి తెలుసు అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావ్? మను”

మను స్పందించలేదు.

“చెప్పు మను?, జరిగింది వివరంగా చెప్తే కదా తెలిసేది”

“కృతి బాగానే ఉంది త్రిలోక్, నేను చెప్పిన పని ఎంతవరకు వచ్చింది”

"నేను అడుగుతున్నది ఏంటి? నువ్వు మాట్లాడుతున్నది ఏంటి? మధుకర్ దగ్గర నీకు కావల్సిన ఇన్ఫర్మేషన్ ఉంది అని నువ్వు అంత గట్టిగా ఎలా చెప్తున్నావ్, అసలు మధుకర్ చనిపోవడానికి ముందు నువ్వు ఎందుకు అతనిని కలిశావ్?"

"నువ్వు అడిగింది అర్ధమైంది, అర్ధమైనా స్పందించలేదు అంటే సమాధానం చెప్పను అని అర్ధం. మధుకర్ ని కలిసింది నేనా కాదా అనే సందేహం నీకు కలిగింది అంటే ఆరోజు అక్కడ నేను ఉన్నప్పుడు మధుకర్ ఇంటికి వచ్చిన పెద్దావిడని మీరు కలిసి ఉండాలి, గుడ్ వర్క్ ఏసిపి వెరీ గుడ్ బాగానే గెస్ చేశావ్"

"ఒప్పుకున్నావ్ కదా అలా రా దారికి, మధుకర్ ని ఎందుకు కలిశావ్?"

"అది నీకు అనవసరం"

"అవునా సరే కానివ్వు, కృతిని అడ్డుపెట్టుకుని ఇదంతా చేయాలని నువ్వు అనుకుంటున్నావ్, నిన్ను ఎలాగైనా పట్టుకుని మధుకర్ చావుకి కారణం తెలుసుకోవాలని అతని బంధువులు అనుకుంటున్నారు.. నేను పై అధికారుల నిర్ణయాలకి లోబడే పనిచేయాల్సి ఉంటుంది"

"అయితే ఇప్పుడేమంటావ్, నీ కూతుర్ని వదులుకుంటావా?"

"లేదు కానీ ఇప్పుడు నాకు రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి నా వృతి రీత్యా నా కూతురికన్నా ముందు నిన్ను పట్టుకోవడమే ముఖ్యం అని నిర్ణయించుకుని నేను పని చేయడం, లేదంటే రెండవది నేనే నిన్ను పట్టుకుంటా అని వారికి అబద్ధం చెప్తూ నీకు సహాయపడటం"

"రెండిట్లో ఏది ఎంచుకుంటున్నావ్?" అంది మను.

"నువ్వు నాకు జరిగింది జరిగినట్లుగా చెపితే రెండవది ఎంచుకోవడానికి ఆస్కారం ఉంటుంది, లేదంటే"

"ఇప్పుడు నీ కూతురు నా దగ్గర ఉంది, నేను చెప్పింది చేస్తేనే తను ప్రాణాలతో బయటపడుతుంది"

"మనూ..., ఒక చిన్న విషయం ఆలోచించు, మందు కనుక్కోవాలంటే రోగం తెలియాలి, అలాగే నీకు కావల్సిన సమాచారం తెలియాలన్నా లేక మధుకర్ చావుకి కారణం తెలియాలన్నా ముందు దానికి సంబంధించిన ప్రతి విషయం నాకు తెలియాలి" అని చెప్పాడు త్రిలోక్.

"నేను మళ్ళీ ఫోన్ చేస్తా ఏసిపి" అని చెప్పి ఫోన్ కట్ చేసింది మను.

పక్కనే ఉన్న ఇన్స్పెక్టర్ చేతన్ ని చూస్తూ...

"ఇంకాసేపట్లో మను ఫోన్ చేస్తుంది చేతన్, ఈలోపు మనం మధుకర్ కేస్ ఫైల్ మరొక్క సారి చూద్దాం" అని త్రిలోక్ చెప్పడంతో, చేతన్ ఇంకా త్రిలోక్ కేస్ ఫైల్ స్టడీ చేస్తూ కూర్చొన్నారు.

★★★

15 నిమిషాల తర్వాత ఫోన్ చేసింది మను.

"ఏసిపి, నేను నీకు జరిగింది చెప్తా... కానీ పూర్తి వివరాలు కాదు" అంది మను.

"నువ్వు నాకు జరిగింది పూర్తిగా చెప్పకుంటే నేను నీకు సహాయం చేయలేను మను" అన్నాడు త్రిలోక్.

"పూర్తిగా చెప్పాల్సిన అవసరం ఏముంది త్రిలోక్, ఒక్కసారి ఆలోచించు నీతి చెప్పడం కోసం కథ మొత్తం చెప్పడం కంటే సమయం లేనప్పుడు నీతి మాత్రం ఓ సూక్తిగా చెప్తే సరిపోతుంది"

"అయితే ఇప్పుడు ఏమంటావ్, పూర్తిగా ఏం జరిగిందో మాత్రం చెప్పను అంటావ్ అంతేనా?"

"కేస్ సాల్వ్ చేయడానికి నీకు అవసరమయ్యేవి మాత్రమే చెప్తా అంటున్నా, అయినా నీ కుతూరు నా దగ్గర ఉన్నా నీ గొంతు పెరగడం నీకు శుభసంకేతం కాదనుకుంటా ఏసిపి"

"సరే మను, చెప్పు... మధుకర్ హత్య చేయబడ్డాడు అని ఎలా చెప్తున్నావ్?"

"ప్రతి మనిషి శరీరంలో సోడియం, పొటాషియం, కాల్షియం, ఐరన్ లాంటి లవణాలు అన్నీ ఉంటాయి... నిజానికి అవన్నీ మనకి మేలు చేశావే మితంగా ఉన్నాడు. కానీ వాటిలో కొన్నిటి శాతం పెరిగితే మాత్రం..." అని చెప్పి ఆపింది మను.

"పెరిగితే మాత్రం... ఏంటి? పెరిగితే ఏంటి?" అడిగాడు త్రిలోక్.

"మధుకర్ చనిపోయే ముందు బ్లడ్ టెస్ట్ చేశారు, దాని ఆధారంగానే మధుకర్ ది సహజ మరణం అని కూడా నిర్ధారించారు... ఇంతకీ ఆ రిపోర్ట్స్ మీకు దొరికాయా?"

"దొరికాయి" అన్నాడు త్రిలోక్ చేతిలోకి బ్లడ్ రిపోర్ట్స్ తీసుకుంటూ.

"కానీ మధుకర్ చనిపోవడానికి సరిగ్గా నాలుగు రోజులు ముందు మధుకర్ ఒక చోట బ్లడ్ డొనేట్ చేశాడు, అతని పరిధిలోని పిఎస్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ జానీ కి యాక్సిడెంట్ ఐతే రక్తం ఇచ్చాడు"

"చేస్తే ఏమైంది, అందులో తప్పేముంది"

"ఏమీ లేదా ఏసిపి, ఒక్క సారి ఆలోచించు... సరిగ్గా ఆలోచించి నీకు అప్పటికి సందేహం రాకపోతే నాకు ఫోన్ చెయ్" అని చెప్పి కాల్ కట్ చేసింది మను.

★★★

"ఏమైంది సర్?" అడిగాడు చేతన్.

"మధుకర్ చనిపోవడానికి ముందు హెడ్ కానిస్టేబుల్ జానీ అనే అతనికి బ్లడ్ డొనేట్ చేసాడట"

"అవునా సర్!! అయినా చేస్తే ఏమవుతుంది?" అడిగాడు చేతన్

"ఏమవుతుంది అనేది తెలియాలి అంటే అసలు మధుకర్ చావుకి రక్తంలో ఉండే సోడియం, పొటాషియం, కాల్షియం, ఐరన్ వంటి లవణాలకి ఏంటి సంబంధం అనేది తెలియాలి" అన్నాడు త్రిలోక్.

"మీకు తెలిసిన డాక్టర్ ఉంటే, ఫోన్ చేయచ్చుగా సర్" అడిగాడు చేతన్,

"అప్పుడే వద్దు ఒక్క నిమిషం" అన్నాడు త్రిలోక్.

కొద్దిసేపు ఆలోచించి "ఆఖరిగా చేసిన బ్లడ్ టెస్ట్ రిపోర్ట్ ఇది, మధుకర్ చనిపోయింది ***అరిథిమియాస్*** అనే వ్యాధి వలన అని ఉంది, అది గుండె జబ్బు అని ఉంది ఇక్కడ, గుండె జబ్బు ఉంటే రక్తం డొనేట్ చేయలేరు కదా" అన్నాడు త్రిలోక్.

"మరి జానీకి రక్తం ఎలా ఇచ్చారు సర్"

"ఓహ్, ఐతే అలా జరిగిందన్నమాట" అంటూ తనకి తెలిసిన డాక్టర్ కి ఫోన్ చేశాడు త్రిలోక్.

చేతన్ కేస్ ఫైల్ చూస్తూ కూర్చున్నాడు, త్రిలోక్ ఒక 5 నిమిషాల పాటు మాట్లాడి కాల్ కట్ చేశాడు.

"ఏం తెలిసింది సర్?" అడిగాడు చేతన్,

"ఒక్క నిమిషం!" అంటూ బ్లడ్ రిపోర్ట్స్ ఫోటోలు తీసి డాక్టర్ కి పంపించాక, మళ్ళీ డాక్టర్ కి ఫోన్ చేసి ఆశ్చర్యపోతూనే డాక్టర్ తో మరొక 15 నిమిషాలు మాట్లాడి కాల్ కట్ చేసాడు త్రిలోక్.

"మధుకర్ చనిపోయింది హైపర్ కలేమియా అనే ఒక వ్యాధి వలన అట, ఆ వ్యాధి ఉన్న వారికి రక్తంలో పొటాషియమ్ శాతం చాలా ఎక్కువ ఉంటుందట, అది క్రమేపీ పెరిగి పెరిగి గుండెపోటుకి దారి తీస్తుందట... ఇలా సివియర్ గా మారే ఈ స్థితినే అరిథిమియాస్ అని అంటారట" అని చెప్పాడు త్రిలోక్.

"అయినా అది కూడా అనారోగ్య కారణమే కదా! సర్?"

"కానీ ఇంకేదో జరిగింది చేతన్ లేకపోతే తను అంత గట్టిగా చెప్పదు, అది మనుని అడిగితే గాని తెలియదు" అంటూ మనుకి కాల్ చేశాడు త్రిలోక్.

"చెప్పు త్రిలోక్, మధుకర్ ఎలా చనిపోయాడో తెలిసిందా?"

"ఎలా చనిపోయాడో తెలిసింది కానీ ఒక్క విషయం అర్థం కాలేదు"

"ఏంటది?"

"మధుకర్ హైపర్ కలేమియా సివియర్ అవడం వలన చనిపోయాడట, అది అనారోగ్య రీత్యా సంభవించిన మరణమే కదా!!!, హత్య ఎలా అవుతుంది?"

"మను గట్టిగా నవ్వి, మధుకర్ కి క్రితం ఎలాంటి అనారోగ్యాలు లేవు, కావాలంటే జనరల్ హెల్త్ చెకప్ చేసినప్పుడు ఇచ్చిన బ్లడ్ రిపోర్ట్స్ చూడండి" అంది మను.

"అంటే ఏంటి అర్థం?" అన్నాడు త్రిలోక్.

"పొటాషియం లెవల్ ఉన్నట్టుండి పెరిగింది, అది ఎలానో తెలిస్తే సరిపోతుంది" అంది మను.

"అది ఎలా తెలుస్తుంది?"

"నిజానికి పోస్ట్ మార్టం చేస్తే దొరికేది, కానీ చేయలేదు కాబట్టి తెలియలేదు. కానీ ఒక్కటి మాత్రం నిజం మధుకర్ ని ఎవరో కావాలనే ఆ స్థితికి తీసుకొచ్చారు అతనిని ఎవరు, ఫోలో అయ్యారో, ఎవరెవరు కాంటాక్ట్ అయ్యారు తెలిస్తే ఎవరు చంపారో ఎందుకు చంపారో తెలుస్తుంది" అని చెప్పి ఫోన్ కట్ చేసింది మను.

"ఈ మను ఏం చదివిందో తెలియడం లేదు మొత్తానికి మధుకర్ ని ఎవరో హత్య చేశారని ఒప్పుకోక తప్పేలా లేదు" అన్నాడు త్రిలోక్.

"అదేంటి సర్ ఉన్నట్టుండి మనుని పొగుడుతున్నారు, అసలు ఏం తెలిసింది?" అడిగాడు చేతన్.

"మధుకర్ కి చనిపోక ముందు వరకూ అతనికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవట, తన దగ్గర క్రితం జనరల్ చెకప్ లో చేయించిన బ్లడ్ రిపోర్ట్స్ ఉన్నాయట, కాబట్టి మధుకర్ ది హత్యే అంటుంది" అని చెప్పాడు త్రిలోక్.

చేతన్ కూడా మాట్లాడేదేమీ లేక మౌనంగా ఉండిపోయాడు.

"అది సరే ముందు కృతి ఎలా ఉందో కనుక్కుంటా" అంటూ త్రిలోక్ మళ్ళీ మనుకి కాల్ చేశాడు.

"చెప్పు త్రిలోక్"

“నేను నా కురురితో మాట్లాడాలి?”

3 నిమిషాల మౌనం తర్వాత... స్పందన లేకపోవడంతో

“హలో?” అన్నాడు త్రిలోక్.

“నాన్నా...” అంటూ అవతలి వైపు నుంచి కృతి మాటలు వినిపించాయి.

“ఎలా ఉన్నావు కృతి తను నిన్ను ఇబ్బంది పెట్టడం లేదు కదా?” అడిగాడు త్రిలోక్.

“లేదు నాన్నా... నన్ను బాగానే చూసుకుంటుంది కానీ నిన్ను అమ్మని చూడాలనిపిస్తుంది” అంది కృతి.

“ఇంకొద్ది రోజులే కృతి, నాన్న నీ దగ్గరకి వస్తాడు” అంటూ కృతి దగ్గర నుంచి ఫోన్ తీసుకుని,

“విన్నవుగా నీ కూతురి మాటలు, మధుకర్ ని చంపింది ఎవరో కనుక్కో...” చెప్పింది మను.

“....................” కాల్ కట్ చేశాడు త్రిలోక్.

(కొనసాగింపు వచ్చే సంచికలో...!)

Post your comments